## క్లుప్తంగా

### బీఎస్ఎఫ్ ఎస్సైకి ఘన స్వాగతం



వేమగిరిలో దేవానందానికి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

**కడియం:** వేమగిరి గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ ఎస్సై రేగుళ్ల దేవానందంకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు శనివారం ఘన స్వాగతం పలికారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని స్వగ్రామానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనకు ఎయిర్‌పోర్టు నుంచి ఘనంగా స్వాగతం పలికి, పూలుజల్లుతూ ఇంటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభయ్యేళ్లుగా బీఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ, ప్రస్తుతం శ్రీనగర్ ఎయిర్‌పోర్టులోని ప్రొటెక్షన్ విభాగంలో ఎస్సై విధులు నిర్వహిస్తున్నానని దేవానందం తెలిపారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్టును టార్గెట్ చేస్తూ ప్రత్యర్థులు చేసిన అన్ని ప్రయత్నాలను ఆర్మీతో కలిసి ఎదుర్కొన్నామని దేవానందం వివరించారు. స్థానిక కాటన్ బాలుర జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 93.61 శాతం పింఛన్ల పంపిణీ

**రాజమహేంద్రవరం రూరల్:** జిల్లాలో శనివారం రాత్రి ఏడు గంటల వరకూ 93.61 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధి కోనేరుపేటలో లబ్ధిదారుకు ఆమె వృద్ధాప్య పింఛను అందజేసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 2,33,924 మంది లబ్ధిదారులకు రూ.102.19 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 2,18,966 మందికి రూ.95.25 కోట్లు పంపిణీ చేశామని డీఆర్‌డీఏ పీడీ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, సచివాలయ కార్యదర్శి రవితేజ పాల్గొన్నారు.

### తుపాన్లపై అప్రమత్తంగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** తుపాన్లు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భారీ వర్షాల వలన నీరు నిలవకుండా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. నీటి శాంపిల్స్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పరీక్షించే ఏర్పాటు చేయాలన్నారు. పాత భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంటుందని, వీఆర్‌ఓలతో ప్రతి గ్రామంలోనూ పాత భవనాలపై పరిశీలన చేసి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. సొంతిల్లున్న వారు పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలోనూ యోగా పోటీలు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారి వివరాలను లక్ష్యం మేరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

### అహల్యాబాయి హోల్కర్ సేవలు ఆదర్శనీయం



అహల్యాబాయి హోల్కర్ జయంత్యుత్సవంలో పాల్గొన్న ఛత్తీస్‌గఢ్ డీసీఎం అరుణ్ సాహూ

**రాజమహేంద్రవరం సిటీ:** పుణ్య శ్లోక అహల్యాబాయి హోల్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి అరుణ్ సాహూ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పిలుపు నిచ్చారు. శనివారం రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచన మేరకు అహల్యాబాయి హోల్కర్ జయంతిని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో హోటల్ మంజీరాలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.జంక్షన్ నుంచి హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయి హోల్కర్ జీవిత విశేషాలు, ఆవిడ పునరుద్ధించిన దేవాలయాలు సాహసోపేత కార్యక్రమాలను కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, రేలంగి శ్రీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ధవళేశ్వరం ప్రధాన డ్రెయిన్



పొదలు, మొక్కలతో కుచించుకుపోయిన ప్రధాన డ్రెయినేజీ

# అస్తవ్యస్తంగా ప్రధాన డ్రెయినేజీ

- పేరుకుపోయిన పూడికలు
- రోడ్డుపైనే మురుగునీరు
- డ్రెయినేజీని విస్తరించాలని ప్రజల డిమాండ్
- భారీ వర్షాలకు ధవళేశ్వరంలోని పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం

**ధవళేశ్వరం:** గ్రామంలోని ప్రధాన డ్రెయిన్ పూడుకుపోయి అస్తవ్యస్తంగా మారింది. పట్టుమని పది నిమిషాలు కొద్దిపాటి వర్షం పడితే చాటు డ్రెయిన్‌లోని మురుగునీరు పొంగి పొర్లి వీధులు, రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ధవళేశ్వరంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన విధంగా ప్రధాన డ్రెయినేజీ ఆధునీకరణకు నోచుకోలేదు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నా ప్రధాన డ్రెయినేజీ పూర్తి స్థాయిలో ఆధునీకరణకు నోచుకోలేదు. ధవళేశ్వరంలోని మురుగు నీరు, వర్షపు నీరు ఈ ప్రధాన కాలువ నుంచే బయటకు వెళుతుంది. కాలువకు ఇరువైపులా అనేక చోట్ల పొదలు పెరిగి ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. కొన్ని చోట్ల పూడిక భారీగా పెరిగిపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలో పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొని దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు విజృంభించడంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వర్షాకాలం సమీపిస్తుండటంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది.

**భారీ వర్షాలు కురిస్తే ప్రమాదమే**

భారీ వర్షాలు కురిస్తే గ్రామంలో పలు ప్రాంతాల్లోని వీధుల్లో మురుగు నీరు పొంగి ప్రవహించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కాటన్‌పేట వాసులు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. సుమారు 60 వేల జనాభా కలిగిన ధవళేశ్వరంలో మురుగునీరు ఈ ప్రధాన కాలువ నుంచి క్వారీ కాలువ మీదుగా బయటకు వెళుతుంది. డ్రెయిన్‌లో పూడికలు పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో చిన్నపాటి వర్షానికి సైతం రోడ్లపై గంటల తరబడి నీరు నిలిచి ఉంటోంది. దీంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన డ్రెయినేజీ దుస్థితిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**పూర్తిస్థాయి ఆధునీకరణ చేపట్టాలి**

ధవళేశ్వరంలోని ప్రధాన డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరణ పనులు చేపట్టి విస్తరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. భారీ వెడల్పుతో ఉండే ఈ డ్రెయిన్ కొన్నిచోట్ల సుమారు 5 అడుగులకు కుంచించుకుపోయింది. కొన్నిచోట్ల పొదలు దట్టంగా పెరిగి ఈ డ్రెయిన్‌ను కప్పేశాయి. దీంతో ప్రధాన డ్రెయిన్‌లోని పూడికలను పూర్తిస్థాయిలో తొలగించడం సాధ్యం కావడంలేదు. డ్రెయినేజీ ఆధునీకరణ చేపడితే వర్షాకాలంలో ముంపు సమస్య తొలగుతుందని పలువురు సూచిస్తున్నారు.

## అక్విడెక్టులో పూడిక తొలగింపు

**అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం**



కాలువ కింద నుంచి అక్విడెక్టులో పూడిక తీయిస్తున్న రైతులు

**కడియం:** దుళ్ల శివార్లలో మడికి కాలువపై ఉన్న అక్విడెక్టులో పేరుకుపోయిన పూడికను రైతులు స్వచ్ఛందంగా శనివారం పూడికతీసి శుభ్రం చేశారు. పొక్లెయిన్‌తో చేపట్టిన ఈ పనుల్లో భాగంగా కాలువ కింద నుంచి ఉన్న అక్విడెక్టులోని ఏళ్ల తరబడి నిలిచిపోయిన పూడికను తొలగించారు. సుమారు వెయ్యి ఎకరాల్లోని ముంపునీరు అక్విడెక్టు ద్వారానే దిగువకు వెళుతుందని వారన్నారు. అక్విడెక్టులోని పూడిక తీసి బాగు చేయించాలని ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో తామే స్వయంగా రైతుల సహకారంతో పనులు ప్రారంభించామని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కంటిపూడి శ్రీనివాస్, రైతులు యన్నమని వెంకటరత్నం నాని, శ్రీరామ చంద్రమూర్తి, కంటిపూడి వీరవెంకట చౌదరి, శ్రీనివాసులు తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి అక్విడెక్టు పైన ఉన్న పుంత రోడ్డు మీదుగా గతంలో కేవలం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, సైకిళ్లు, మోటార్ సైకిళ్లు వంటివి మాత్రమే ప్రయాణం సాగించేవని రైతులు తెలిపారు. ఇటీవల ఈ ప్రాంతంలో నర్సరీ మొక్కలతో భారీ లారీలు ప్రయాణం సాగిస్తున్నాయన్నారు. దీంతో రోడ్డు కుంగి అక్విడెక్టు దెబ్బతిని పూడుకుపోయిందని రైతులు వాపోతున్నారు. దీనిపై ఇరిగేషన్, డ్రెయినేజీ బోర్డు అధికారులకు ఈ అక్విడెక్టును పటిష్టపరచి, పూడిక తీసి రైతుల్ని ఆదుకోవాలని విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన శాశ్వత పటిష్ట చర్యలు తీసుకోవాలని, పంటల సాగుకు ఎంతో ఉపయోగపడే ఇలాంటి పురాతన కట్టడాలు, అక్విడెక్టు లను సంరక్షించాలని రైతులు కోరుతున్నారు.

## యోగా సాధనతో ఆరోగ్యం

**కంబాలచెరువు:** స్థానిక ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో శనివారం 6వ రోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు హాజరై మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమం ద్వారా యోగా సాధనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. దీనిలో భాగంగానే సమాజంలోని వివిధ వర్గాలను భాగస్వామ్యం చేస్తూ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ రూపొందించామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో యోగ సాధనలో భాగంగా గోదారి గట్టు ఒడ్డున ఉన్న సరస్వతీ ఘాట్ వద్ద ఆదివారం ఉదయం యోగ సాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. యోగాపై ప్రజల్లో చైతన్యం కలిగించే దిశగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలన్నారు. రాజమహేంద్రవరం నగర ప్రజలు, స్త్రీలు, విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులు అందరూ కలసి యోగ సాధనలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 1న గోదావరి నది ఒడ్డున ఉన్న సరస్వతీ ఘాట్‌తో పాటు గౌతమి ఘాట్ వద్ద 7వ రోజు యోగ సాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి , జిల్లా ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.రమేష్ ,యోగాంధ్ర జిల్లా సమన్వయకర్త పి.కాజియా, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో యోగా శిక్షణ కేంద్రాలు**

**రాజమహేంద్రవరం రూరల్:** ప్రజలందరినీ యోగాంధ్రలో భాగస్వాములు చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమసాధికారత అధికారిణి కేఎన్.జ్యోతి అధికారులను కోరారు. శనివారం సాయంత్రం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేఎన్.జ్యోతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదు యోగా శిక్షణ తరగతుల కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. యోగాలో ప్రజలందరూ పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.శ్రీనివాస్, మండల పరిషత్ పరిపాలనాధికారి ఆకెళ్ల ప్రసాద్, మండల ఇంజనీరింగ్ అధికారి సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అల్లు రామలింగయ్య హోమియో కళాశాలలో యోగాసాధన



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జ్యోతి

## బాల కార్మికులను గుర్తించేందుకు తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌ఓ సీతారామమూర్తి తదితరులు

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** తూర్పుగోదావరి జిల్లాలో కార్మిక చట్టం ప్రకారం 17 కేసులను నమోదు చేసి రూ.96,118 సొమ్మును పరిహారంగా కార్మికులకు అందించామని నోడల్ ఆఫీసర్, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ చాంబర్లో వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామమూర్తి మాట్లాడుతూ బాల, కౌమార కార్మికుల చట్టం నిబంధనల అమలు కోసం వివిధ శాఖల అధికారుల సహకారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ పని చేస్తుందన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి బుధవారం కార్మిక శాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహించడం ద్వారా జిల్లాలో బాల కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. రెండేళ్లుగా తనిఖీలు నిర్వహించి, 28 వృత్తులు, ప్రక్రియల్లో ఉల్లంఘనలు గుర్తించి చట్టాన్ని అతిక్రమించిన యజమానులపై కేసులు చేశామన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్, బీఎస్ఎం వలీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## పరిశ్రమల స్థాపనపై యువత దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

**కడియం:** యువత పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శనివారం స్థానిక వెలుగుబంటి రామచంద్రరావు కల్యాణ మండపంలో ఆదివారం స్కిల్ డెవలప్‌మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సమావేశం ఎంపీడీవో రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోరంట్ల మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకుని యువత పరిశ్రమల స్థాపనవైపు అడుగులు వెయ్యాలన్నారు. సీడ్ ఏపీ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తదితర సంస్థల సహకారంతో పరిశ్రమల ఏర్పాటులో శిక్షణ, నిధులు సమీకరణ, సాంకేతిక సాయం తదితర అంశాల్లో సహకారం అందిస్తారన్నారు. సీడ్ ఏపీ జిల్లా మేనేజర్ కిరణ్, విజయనగరం సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అనిల్ చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఆకట్టుకుంది.ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, నాయకులు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, వెలుగుబంటి నాని, ముద్రగడ జెమి, బోడపాడి గోపి, పంతం గణపతి, ఆదిమూలం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## విభజన రాజకీయాలను తిప్పికొట్టండి




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

**ప్రకాశం నగర్ :** బీజేపీ ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, వాటిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపాల్ స్టేడియం వద్ద జట్ల సంఘం మహా సభ సంఘం అధ్యక్షుడు కె. రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వనజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఐ శత వసంతాల కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తామని, వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో ఎర్ర జెండా దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల కోసం, రైతు, కార్మిక వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా తాసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 9న సార్వత్రిక సమ్మెకు చేపడతామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు.

## సుబ్బారావు సేవలు ఆదర్శనీయం



సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

**కడియం :** దేవదాయ శాఖ ఉద్యోగిగా ఏ హోదాలో ఉన్నా ఆయా ఆలయాల ఆదాయ వనరులు పెంచడంతో పాటు, భక్తులకు మెరుగైన సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందిన బహదూర్‌షా వెంకటసుబ్బారావు (ఈవో సుబ్బారావు) సేవలు అభినందనీయమని జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి కే నాగేశ్వరరావు అన్నారు. వీరవరం కోదండరామ స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాలకు గ్రేడ్ 2 ఈవోగా పనిచేసి పదవీ విరమణ పొందిన సుబ్బారావు అభినందన సత్కారం రాజమహేంద్రవరంలోని చందా సత్రంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలకు ఈవోగా సుబ్బారావు సేవలందించి ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా పని చేసి అందని మన్ననలుల పొందారని నాగేశ్వరరావు ఈ సందర్భంగా గుర్తు చేసారు. అనంతరం సుబ్బారావు దంపతులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఎండోమెంట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ ప్రసాద్, చందాసత్ర ఈవో శ్రీదేవి, టి సుబ్రహ్మణ్యం, జిల్లాలోని వివిధ ఆలయాల ఈవోలు శ్రీనివాసరావు, వేంకటేశ్వర రావు, టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయకుమారి సేవలు స్ఫూర్తిదాయకం



విజయకుమారిని సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

**అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** జిల్లా స్త్రీశిశు సంక్షేమ, సాధికారత అధికారిణి విజయకుమారి సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక రజక ఫంక్షన్ హాల్లో విజయకుమారి పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమానికి ఆమె, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమారి, వీరరాఘవులు దంపతులను జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థకు స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా విజయకుమారి పూర్తి సహకారం అందించారన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విజయకుమారికి తన విధులను సమర్థవంతంగా నిర్వహించారని, నేటితరం ఉద్యోగులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విజయకుమారి మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు, ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వీణాదేవి, సమగ్రశిక్ష ఏపీడీ సుభాషిని, నోడల్ ఆఫీసర్ నాగలక్ష్మి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు రోటరీ క్లబ్ అవార్డులు



అవార్డుల గ్రహీతలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

**రాజమహేంద్రవరం సిటీ:** నగరంలో పలు విభాగాల్లో విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి వారికి అవార్డులు అందించే కార్యక్రమం నిర్వహించినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు నాళంనరసింహారావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం ఏకేసీ రోటరీ హాల్‌లో, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులు 2024–25 ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న 23 మందికి రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులను లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, విశిష్ట అతిథి బుర్లగడ్డ సుబ్బారాయుడు, ఒకేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ ఏలేటి రవిబాబు, అసిస్టెంట్ గవర్నర్ దొరబాబు, కార్యదర్శి చంద్రశేఖర్ చేతుల మీదుగా రోటరీ లాంఛనాలతో, అవార్డులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంట్ వి.భాస్కరరామ్, మద్దూర్ శివ సుబ్బారావు, బెరులాల్ జైన్, గౌతమి ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ వాడ్రేవు డాక్టర్ వీకే రాజు, కేటీ కృష్ణారావు, నాలం రాహుల్, హసన్, నాగేంద్ర కిషోర్ పాల్గొన్నారు.

**అర్బన్ డీఐకు ఒకేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు**

**కంబాలచెరువు:** రాజమహేంద్రవరం అర్బన్ స్కూల్స్ డీఐ బి.దిలీప్‌కుమార్, ఆదిత్య కళాశాల ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీవీఎస్.నాగేశ్వరరావు ఒకేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డులు అందుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో శనివారం ఏకేసీ రోటరీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఈ అవార్డును ప్రదానం చేసారు. కార్యక్రమంలో జాస్తి మూర్తి, బోర్ల గడ్డ వెంకటసుబ్బారాయుడు తదితరులు అవార్డు గ్రహీతల సేవలను కొనియాడారు.

### అధ్యాపకుల సేవలు అభినందనీయం



పదవీ విరమణ పొందిన అధ్యాపకులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి

**సీటీఆర్ఐ:** మూడు దశాబ్దాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన అధ్యాపకుల సేవలు అభినందనీయమని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి అన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇద్దరు సీనియర్ అధ్యాపకులు శనివారం పదవీ విరమణ పొందిన సందర్భంగా వారిని సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఆంగ్ల అధ్యాపకుడు కేఎస్.రత్నకుమార్, ఎకనామిక్స్ అధ్యాపకురాలు సీవీ రామలక్ష్మి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాఘవ కుమారి మాట్లాడుతూ కెఎస్ రత్నకుమార్ మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా సేవలందించి, విద్యార్థులకు అద్భుతమైన బోధనను అందించారన్నారు. సీవీ రామలక్ష్మి శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు దశాబ్దాలకు పైగా ఎకనామిక్స్ అధ్యాపకురాలిగా పనిచేశారన్నారు. అర్థశాస్త్రంలో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించారని కొనియాడారు. ఈ ఇద్దరు అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఒకేసారి పదవీ విరమణ చేయడం కళాశాలకు తీరని లోటన్నారు.

### ఘనంగా ఆలయ కలశాల ప్రతిష్ఠాపన



అమ్మవారి ఆలయంపై ప్రతిష్ఠించిన కలశాలు

**కడియం:** గ్రామదేవత వనుమలమ్మ వారి ఆలయ శిఖరంపై కలశాలను శనివారం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అమ్మవారిని శెట్టివారి ఆడపడుచుగా భావించి పూజిస్తుంటారు. ఈ నేపథ్యంలో కలశ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో కలశ ప్రతిష్ఠాపన చేసారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### ధూమపానంతో క్యాన్సర్ ప్రమాదం

**రాజమహేంద్రవరం రూరల్:** ధూమపానం వలన క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించి డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ పొగాకు వలన అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో పొగాకు పదార్థాలు విక్రయం నిషేధమన్నారు. పొగాకు అలవాట్లకు యువత దూరంగా ఉండాలన్నారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, డిప్యూటీ డెమో సత్యకుమార్, ఎపిడెమియాలజిస్టు సుధీర్‌బాబు, సైకాలజిస్ట్, సోషల్ వర్కర్ అర్జునరావు పాల్గొన్నారు.

**అవగాహన ర్యాలీ**

**కంబాలచెరువు:** పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జీఎస్ఎల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం పుష్కర్ ఘాట్‌లో మానవహారం నిర్వహించారు. జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ నుంచి పుష్కర్ ఘాట్ వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఘంటా సునీల్, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ రమ్య, జీఎస్ఎల్ స్వతంత్ర అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

### కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం):** అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి, గ్రేవ్ ఎక్విటల్, మిస్సింగ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ డి.నరసింహకిశోర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ క్రైం రివ్యూ మీటింగ్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసింగ్, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయాలన్నారు.